క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



జనగామ రూరల్: జనగామ పోపా ఆధ్వర్యంలో పద్మశాలీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం పట్టణంలోని క్లౌం రోడ్డులోని మార్కండేయ దేవాలయంలో అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ పోకల జయున ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మహేందర్, కె.భాస్కర్, ఏ శ్రీనివాస్, బాలరాజు ఉన్నారు.

కురుమ సంఘం ఆధ్వర్యంలో..

వడ్లకొండలో కురుమ యువజన సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మోటే రాజు, రవి, సత్యం, రమేష్, రాజు, మల్లేష్ పాల్గొన్నారు.

అవసరాల మేరకు సేవలు అందించాలి

లింగాలఘణపురం: విద్యార్థుల అవసరాల మేరకు లయన్స్ క్లబ్‌లు సేవలు అందించాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు సూచించారు. సోమవారం మండలంలోని చీటూరు ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ 320ఎఫ్ ఆధ్వర్యంలో చిన్నం సత్యనారాయణ కూతురు అభిష్ట జన్మదినం సందర్భంగా విద్యార్థులకు షూస్, సాక్స్‌లు బహూకరించారు. హెడ్మాస్టర్ శంకర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు మాట్లాడారు. జనగామ అధ్యక్షుడు కూతాటి ఉప్పలయ్య, సర్పంచ్ మల్లేశం, ఎంపీటీసీ సోమలక్ష్మి, పాఠశాల చైర్మన్ ప్రభాకర్, లయన్స్ క్లబ్ లైజెనింగ్ ఆఫీసర్ కృష్ణ జీవన్ బజాజ్, రీజియన్ చైర్మన్ ప్రమోద్‌కుమార్, కార్యదర్శి బాబు, కోశాధికారి సందీప్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి



పాలకుర్తి: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సర్పంచ్ గంటా పద్మ భాస్కర్ అన్నారు. మండలంలోని వావిలాల ప్రభుత్వ పాఠశాలకు చెందిన 125 మంది విద్యార్థులకు ఆర్‌టీపీ గంటా రవీందర్ టీషర్టులు, బ్యాడ్జీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. హెచ్‌ఎం మల్లయ్య, ఉపసర్పంచ్ కోట విజయరాజు, శీల లింగయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ కూరబోయిన కుమార్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్

బచ్చన్నపేట: గుడిసెలో గ్యాస్ సిలిండర్ పేలి ప్రమాదం సంభవించిన ఘటన మండలంలోని కొడవటూర్‌లో ఆదివారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీల అనిత గుడిసెలో కుటుంబాన్ని వెళ్లదీస్తుంది. ఇంట్లో దీపం పెట్టి భర్త, పిల్లలతో సహా పక్కింట్లో నిద్రించింది. అర్ధరాత్రి ప్రమాదవశాత్తు పెద్ద శబ్దం రావడంతో పాటు మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో దుస్తులు, విలువైన వస్తువులు సైతం కాలిపోయాయి. వారు పక్కింట్లో నిద్రించకుంటే పెద్ద ప్రమాదం సంభవించేది. బాధిత కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

కేసు నమోదు

స్టేషన్‌ఘన్‌పూర్: మోటార్ సైకిల్‌కు నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనంపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు ఘన్‌పూర్ సీఐ రాఘవేందర్ తెలిపారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాలకు చెందిన షేక్ రంజాన్ అనే వ్యక్తి మోటార్ సైకిల్‌కు నంబర్ ప్లేట్ లేకుండా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతుండగా ఘన్‌పూర్‌లో పోలీసులు పట్టుకుని వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. అతడిపై చీటింగ్ కేసు నమోదు చేశామని, జనగామ జిల్లా పరిధిలో నంబర్ ప్లేట్ లేకుండా చీటింగ్‌కేసు నమోదు కావడం ఇదే మొదటిసారి అన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వాహనాలకు ముందు, వెనుకాల నంబర్ ప్లేట్లను కలిగి ఉండాలని, లేనిచో చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాబోయ్ దుమ్ము

- హెడ్‌పోస్టాఫీస్ ఏరియాలో దుమ్ముతో సతమతమవుతున్న ప్రజలు
- రోడ్డుకు మరమ్మతు చేయాలని వేడుకోలు



వాహనాల రాకపోకలతో లేస్తున్న దుమ్ము

జనగామ: పట్టణంలోని హెడ్‌పోస్టాఫీస్ ఏరియాలో దుమ్ము నుంచి కాపాడాలని సమీప ప్రాంత వ్యాపారులు, గృహ యజమానులు అధికారులను వేడుకుంటున్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితం పైపులైన్ నిర్మాణం కోసం రోడ్డును తవ్విన మున్సిపల్ అధికారులు తూతూ మంత్రంగా మరమ్మతు పనులు చేసి చేతులు దులుపుకున్నారు. జనగామ–హుస్నాబాద్, గ్రేయిన్ మార్కెట్, మండలంలోని వివిధ ప్రాంతాలకు ప్రధాన రహదారి కావడంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపార, వాణిజ్య సంస్థలు, గృహాలు, ఫుట్‌పాత్ బిజినెస్‌లకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. తెల్లవారు లేచింది మొదలుకుని రాత్రి 11 గంటల వరకు దుమ్ముతో హెడ్‌పోస్టాఫీసు ఏరియా కనిపించని పరిస్థితి నెలకొంది. కలెక్టరేట్ గ్రీవెన్స్, మున్సిపల్ కమిషనర్, డీఈ ఇలా అధికారులకు వందలాది వినతి పత్రాలు అందించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రం.. పురపాలిక కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ సమస్యకు పరిష్కారం లభించకపోవడంపై ప్రజలు విమర్శలు చేస్తున్నారు. దుమ్ముతో సతమతమవుతున్నా ఎవరూ పట్టించుకోక పోవడంతో వ్యాపారులు బకెట్లలో నీరు తీసుకొచ్చి రోడ్డుపై చల్లుతూ ఉపశమనం పొందుతున్నారు.



దుమ్ము లేవకుండా రోడ్డుపై నీళ్లు చల్లుతున్న వ్యాపారి

అభివృద్ధికి అడ్డంకిగా బీజేపీ

- ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ అభివృద్ధికి అడ్డం పడుతున్న బీజేపీకి, కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని, దేశ ప్రధాని మోదీ హఠావో.. కేసీఆర్‌కు బిఠావో నినాదంతో ప్రతీ ఒక్కరూ ముందుకు సాగాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో సోమవారం రూ.2.80 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఘన్‌పూర్‌లో చేపట్టిన క్రీడాప్రాంగణం ప్రారంభం, క్రీడాప్రాంగణం నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు సీసీ రోడ్డుకు శంకుస్థాపన, స్థానిక రైల్వేగేటు వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపం నిర్మాణానికి భూమి పూజ, మిషన్‌భగీరథ పనుల ప్రారంభం, సెంట్రల్ లైటింగ్, గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్, దళితబంధుకు సంబంధించి ఏడు యూనిట్ల ప్రారంభం, వాటర్‌షెడ్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని, ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ రాంరెడ్డి, జెడ్పీటీసీ మారపాక రవి, ఎంపీపీ కందుల రేఖ, మార్కెట్ చైర్మన్ గుజ్జరి రాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకన్న, డీఎల్‌పీఓ వెంకటప్రసాద్, సర్పంచ్ తాటికొండ సురేష్, ఉపసర్పంచ్ నీల ఐలయ్య, ఎంపీటీసీలు గన్ను నర్సింహులు, ఎస్.దయాకర్, ఈఓ సత్యనారాయణ, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్, బొల్లు లక్ష్మీ, చిగురు సరిత, తోట సత్యం, లకావత్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన గ్రంథాలయ చైర్మన్



చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామ నివాసి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి సోమవారం ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ వంగాల జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఐకమత్యంగా ఉండాలి



మాట్లాడుతున్న సిద్ధిరాజ్

చిల్పూరు: యాదవులందరూ సంక్షేమ పథకాలను పొందేందుకు ఐకమత్యంగా ఉండాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బసుక సిద్ధిరాజ్ యాదవ్ కోరారు. మండలంలోని కొండాపూర్‌లో సోమవారం సంఘం మండల అధ్యక్షుడు కొండ కనుకయ్య అధ్యక్షతన యాదవ కుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్పంచ్ రజితరవీందర్, ఎంపీటీసీ అయిలమ్మ, ఎల్లయ్య, సమ్మయ్య, సంపత్, డీలరు రాజకొంరయ్య, శ్రీను, మహేందర్, కొండ శ్యామ్, రవి, కుమార్ పాల్గొన్నారు.

రుణాలు ఇవ్వాలి

జనగామ రూరల్: వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న చేనేత కార్మికులకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు మంగళంపల్లి జనార్దన్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ జిల్లాలో చేనేత కుటుంబాలు వృత్తిపై ఆధానపడి జీవిస్తున్నాయని వారికి ప్రోత్సాహం అందించాలని కోరారు. మచ్చ బాలనర్సయ్య, దోర్నాల కుమార్ పాల్గొన్నారు.

దాతల కృషి స్ఫూర్తిదాయకం

పాలకుర్తి టౌన్: చదువుతో పాటు శారీరక, మానసిక ఉల్లాసానికి ఉపయోగపడే క్రీడల అభివృద్ధికి దాతల కృషి స్ఫూర్తిదాయకమని సర్పంచ్ వీరమనేని యాకాంతరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు, పీడీ వాసుదేవారావు, మహాత్మా హెల్పింగ్ హ్యాండ్ వ్యవస్థాపకుడు గంట రవీందర్ సహకారంతో లాంగ్ జంప్, హై జంప్ ఫిట్ (గుంత) నిర్మాణ చేపట్టారు. హెచ్‌ఎం శోభరాణి, ఎస్‌ఎంసీ చైర్మన్ సమ్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో లక్ష్యసాధన



శిక్షణ ఇస్తున్న శివకుమార్

జనగామ రూరల్: ఏకాగ్రతతో విద్యార్థులకు లక్ష్యసాధన సాధ్యమవుతుందని మా ఇల్లు సంస్థ మోటివేటర్ జంగం శివకుమార్ అన్నారు. సోమవారం మండలంలోని చౌడారం కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఎస్.రాణి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మూడు గంటల పాటు క్రమశిక్షణ, విలువలు, చదువు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధనతోపాటు సేవాభావం పెంపొందించుకోవాలన్నారు. ఉన్నత చదువులు చదవాలంటే లక్ష్యం గొప్పగా ఉండాలని.. దానికి తగిన విధంగా పట్టుదలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

టీజీవీపీ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీస్‌స్టేషన్‌లో టీజీవీపీ నాయకులు

జనగామ: ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉద్యోగ పరీక్షల్లో అభ్యర్థులకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ టీజీవీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రగతి భవన్ ముట్టడి నేపథ్యంలో ఆ సంఘ నాయకులతో ఇతర విద్యార్థి సంఘ ప్రతినిధులను సోమవారం జనగామ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. టీజీవీపీ జిల్లా కార్యదర్శి తుంగ కౌశిక్, పట్టణ అధ్యక్షులు వెంపటి అజయ్‌తో పాటు పలువురు నాయకులను పోలీసులు పీఎస్‌కు తరలించారు. కేసీఆర్ ప్రభుత్వం విడుదల చేస్తున్న ప్రతి నోటిఫికేషన్‌లో తప్పులు దొర్లుతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి నిరుద్యోగులు, విద్యార్థులు గుణపాఠం చెప్పబోతున్నారని అన్నారు.

‘కంటివెలుగు’ విజయవంతానికి కృషి

పాలకుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18 నుంచి రెండో విడత చెపడుతున్న ‘కంటి వెలుగు’ కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలని డీఆర్డీఓ రాంరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య, జీపీ సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.మదార్, ఎంపీడీఓ వనపర్తి అశోక్‌కుమార్, తహసీల్దార్ పాల్‌సింగ్, వైద్యాధికారి అర్చన పాల్గొన్నారు.

నర్మెట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెడుతున్న రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎండి. ఖాజామొయినొద్దీన్ అన్నారు. మండల పరిషత్ కార్యలయంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ ఎండి. గౌస్, వైస్‌ఎంపీపీ ఆగిరెడ్డి, డాక్టర్ కిషోర్, ఎంపీఓ అరవింద్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మురళి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉన్నారు.



నర్మెట: మాట్లాడుతున్న ఖాజామొయినొద్దీన్

నేడు కంటి వెలుగుపై సర్వసభ్య సమావేశం

జనగామ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమంపై మంగళవారం మండల ప్రత్యేక సర్వసభ్యసమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ కళింగరాజు, ఎంపీడీఓ హసీం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

బాధిత కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న ప్రభాకర్ తదితరులు

కొడకండ్ల: కొడకండ్ల గ్రామ పంచాయతీలో 30 ఏళ్లుగా వాటర్‌మెన్‌గా సేవలందిస్తూ ప్రమాదావశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందిన సున్నపు శ్రీనివాస్ కుటుంబానికి స్థానిక వాట్సాప్ గ్రూపు సభ్యులు చేయూతనిచ్చారు. అకస్మికంగా మృతి చెందిన వాటర్‌మెన్ కుటుంబానికి తమవంతుగా స్థానిక వార్డు సభ్యుడు మహ్మద్ షన్ను ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని స్థానిక వాట్సాప్ గ్రూపులో కోరారు. వెంటనే స్థానిక ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం దొర్నం ప్రభాకర్‌తోపాటు 49 మంది గ్రూపు సభ్యులు ముందుకొచ్చి సాయం అందించారు. వాట్సాప్ ద్వారా పోగైన రూ.52,500 సోమవారం మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. పొన్నం వెంకన్న, కొటగిరి అనీల్, ప్రసన్న, అంజయ్య, మహేష్, వెంకట్రాంనర్సయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

ఘన్‌పూర్‌లో కోర్టు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న వినోద్

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్‌కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో కోర్టును ఏర్పాటు చేయాలని టీపీసీసీ మాజీ కార్యదర్శి చేపూరి వినోద్ డిమాండ్ చేశారు. ఘన్‌పూర్‌లో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన ఘన్‌పూర్‌లో ఇప్పటికే కోర్టు ఉండాల్సిన అవసరం ఉందని, అయితే స్థానిక ఎమ్మెల్యే, టీఆర్‌ఎస్ నాయకుల నిర్లక్ష్యంతో ఆలస్యం అయిందన్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రజల అవసరాలను గుర్తించి త్వరితగతిన కోర్టును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. రాంచంద్రం, ఏలియా, సుదర్శన్, మారపాక స్వామి తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయం



పాఠశాలకు టీవీ బహూకరిస్తున్న దాతలు

నర్మెట: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని మండల నోడల్ ఆఫీసర్ ఐ.వెంకట్ రెడ్డి అన్నారు. మండలంలోని ఆగాపేట ఎంపీయూపీఎస్ పాఠశాల విద్యార్థులకు ఎస్‌ఆర్‌ఐ గంగుల వివేక్ రెడ్డి తన తండ్రి రిటైర్డ్ హెచ్‌ఎం ప్రతాప్ రెడ్డి జ్ఞాపకార్థం సోమవారం రూ. 33వేల విలువగల స్మార్ట్ టీవీని అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఉప్పలయ్య మాట్లాడుతూ గత మూడేళ్లుగా వివేక్‌రెడ్డి పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తూ పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలువడం హర్షించదగ్గ విషయమని, దాతలు ముందుకువచ్చి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేయూత నివ్వాలని కోరారు. అనంతరం విద్యార్థులు దాతను శాలవాతో సత్కరించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ సమ్మయ్య, ఉపాధ్యాయులు కవిత, ఇందిర, సునీత, సీఆర్పీ దయాకర్, దాత తల్లి సులోచనా దేవి, కుటుంబ సభ్యులు వేముల శ్రీనివాస్ రెడ్డి, నర్సింహారెడ్డి, గంగుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఇంగ్లిష్’లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జఫర్‌గఢ్: స్థానిక ప్రభుత్వ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు దేశిని షణ్ముకప్రియ, రాపాక శ్రీనిత మండలస్థాయిలో జరిగిన ఇంగ్లిష్ మాధ్యమ పోటీ పరీక్షల్లో ప్రతిభను చూపి ప్రథమ, ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు సోమవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన మండలస్థాయి ఇంగ్లిష్ మాధ్యమ పోటీ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభను కనబర్చి విజేతలుగా నిలవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేష్, పావని, జానినాయక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలే ‘క్లబ్’ లక్ష్యం



మాట్లాడుతున్న పరశురాములు

రఘునాథపల్లి: సామాజిక సేవా కార్యక్రమాలే లయన్స్ క్లబ్ లక్ష్యమని లయన్స్ గవర్నర్ కన్నా పరశురాములు అన్నారు. లయన్స్ క్లబ్‌ఆఫ్ రఘునాథపల్లి స్టేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ప్రతిమ ఆస్పత్రి ఆర్థిక సహకారంతో మండల కేంద్రంలోని ఆర్యవైశ్యభవన్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత గుండె వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో పాల్గొన్న ప్రజలకు నిపుణులైన కార్డియాలజీ, జనరల్ ఫిజిషియన్ వైద్యులు బీపీ, జీఆర్‌బీఎస్, 2డీ ఎకో, ఈసీజీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పోకల శివకుమార్, గంగిశెట్టి ప్రమోద్‌కుమార్, కూరెళ్లి ఉపేందర్, శంకర్‌రెడ్డి, శ్రీకాంత్, లక్ష్మినారాయణ, ప్రదీప్, రాజు, శంకరయ్య, సోమేశ్వర్, చిరంజీవులు, శ్రీనివాస్, శంకర్ లింగం, రాజేందర్, తెరిసారెడ్డి, ప్రతిమ, డాక్టర్ సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

పంట పొలాలకు పందుల బెడద

చిల్పూరు: మండలంలోని నష్కల్‌లోని పంట పొలాలకు పందుల బెడద తప్పడం లేదు. పంట పొలాలను పందులు ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాట్లు వేసిన పొలాల్లోకి పందుల గుంపులు చొరబడి నారుతోపాటు వరాలను నాశనం చేస్తున్నాయని రైతులు వాపోయారు. ఇప్పటివరకు శాగంటి యోబు, రంగు శివరాజ్‌లకు చెందిన నాటు వేసిన పొలాలను పందులు ధ్వంసం చేశాయి. గత పంట కాలంలోనూ పందులు ఈ విధంగానే ధ్వంసం చేయగా సర్పంచ్ కర్ణకంటి స్వప్న వెంకటేశ్‌కు ఫిర్యాదు చేయగా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి తదనంతరం విస్మరించాడని రైతులు తెలిపారు. పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టి పంట వేశామని, అధికారులు స్పందించి పందుల బెడద నివారించాలని రైతులు కోరుతున్నారు.

పందుల యజమాని నిర్లక్ష్యం



పంట పొలాలను ధ్వంసం చేస్తున్న విషయాన్ని పందుల యజమానికి పలు మార్లు చెప్పినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడు. వరాలను ధ్వంసం చేయడంతో ఇబ్బంది పడుతున్నాం. మళ్లీ వాటిని పెట్టాలంటే ఖర్చు తప్పడం లేదు. ఇక నుంచి పొలాల్లోకి పందులు వచ్చి ధ్వంసం చేస్తే వాటి యజమానికి జరిమానా విధించాలి.

– శాగంటి మణి, రైతు



పంట పొలంలో సంచరిస్తున్న పందులు

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమేష్

జఫర్‌గఢ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఐ మండల కార్యదర్శి జువ్వారి రమేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని తీగారంలో వివిధ పార్టీలకు చెందిన 32 కుటుంబాలు రమేష్ సమక్షంలో సీపీఐలో చేరారు. వారికి కండువా కప్పి సీపీఐలోకి ఆహ్వానించారు. నాయకులు మండల గట్టుమల్లు, కలకోట రాజయ్య, కొంరయ్య, వెంకన్న, మహేష్, రాజు, ఎలేంద్ర, శ్రీను, నర్సయ్య, రజిత, రేణుక పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

లింగాలఘణపురం: ఈ నెల 13, 14 తేదీల్లో జరిగే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యుటీఎఫ్) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని, ఉపాధ్యాయ సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని, పదోన్నతులు కల్పించడంలేదని, మోడల్ స్కూల్స్, కస్తూరిబా గాంధీ పాఠశాలలు, గురుకులాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని విమర్శించారు. ఈ సమస్యలపై చర్చించేందుకు జరిగే రాష్ట్ర మహాసభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహ్మలు, కృష్ణ, మండల బాధ్యులు మల్రెడ్డి, వీరయ్య, హెచ్‌ఎం ఆనంద్‌కుమార్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల: ఈ నెల 13, 14 తేదీల్లో రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు సంఘ సభ్యులు, నాయకులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ముషీర్‌ఖాన్ కోరారు. మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మహాసభలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి ఆహ్వాన పత్రాలను ఆయన అందజేశారు. నాయకులు వెంకటాద్రి, సోమయ్య, వీరభద్రం, మొయినోద్దీన్, గోర్‌సింగ్, కనకరాజు, మౌనిక, సత్యనారాయణ, రాజు, రాజేందర్, జలజ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

దేవరుప్పుల: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిర్దిష్ట పోరాటం అనివార్యమని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కందుల శ్రీనివాస్ అన్నారు. కామారెడ్డిగూడెం హైస్కూల్‌లో రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను మండల నోడల్ అధికారి సీహెచ్ ఉపేందర్, హెచ్‌ఎం ఐ శ్రీలతల ఆవిష్కరించారు. ఎచ్‌ఎం శ్రీలత, మండల శాఖ అధ్యక్షుడు ముడిదె రాము, ప్రధాన కార్యదర్శి గడిపే శ్రీనివాస్, మండల కార్యవర్గ సభ్యులు గోవర్దన్ రెడ్డి, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: రంగారెడ్డి జిల్లా సాగర్ రోడ్‌లోని మన్నెగుడెంలో నిర్వహించే టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి చిక్కుడు శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు.



లింగాలఘణపురం: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు